చేరనీ నీ పాద 'దీపం'..

జిల్లాలో వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు
ఆయా మండలాల్లో కిక్కిరిసిన శైవ క్షేత్రాలు
వేకువజామునే ఒత్తులు వెలిచించిన భక్తులు

కూసుమంచి/ మధిర/ తిరుమలాయపాలెం/ ఎర్రుపాలెం/ బోనకల్లు/ ముదిగొండ, నవంబర్ 15 : 'ఆరనీకుమా ఈ దీపం కార్తీకదీపం.. చేరనీ నీ పాద దీపం.. కర్పూర దీపం..' అంటూ మహిళా భక్తులందరూ కార్తీక దీపాలు వెలిగిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు కిక్కిరిసిపోయాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మహిళా భక్తులు వేకువజామునే స్థానిక జలాశయాలకు వెళ్లి పుణ్యాసాన్నాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు చేరుకొని 365 ఒత్తులు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిమంది భక్తులు తరలిరావడంతో కూసుమంచి శివాలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రధాన ఆలయంలో రూ.500 టికెట్‌తో అభిషేకాలు నిర్వహించారు. రూ.20 టికెట్‌తో ఉచిత దర్శనాలు ఏర్పాటుచేశారు. ఎర్రుపాలెం మండలం వెంకటాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వర బాలకోటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఆలయ అభివృద్ధి కోసం సుమారు రూ.6 లక్షలు కేటాయించారు. నూతనంగా నిర్మించిన మెట్లమార్గాన్ని ప్రారంభించారు. ఏటా నిర్వహించే ఆనవాయితీ ప్రకారం ఈ ఏడాది కూడా ముదిగొండ మండలం ముత్తారంలో సీతారామచంద్ర స్వామి వారికి శుక్రవారం తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో స్వామివార్లను వనంవారి కిష్టాపురం ఊరచెరువు వద్దకు తీసుకెళ్లారు. విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై స్వామివార్లను ఆసీనులను చేసి జలవిహారం చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో వీక్షించారు.

కారేపల్లి: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పెనుబల్లి: పాదయాత్ర చేస్తున్న అయ్యప్ప మాలధారులు

కారేపల్లి: పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు

వైరారూరల్: పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

కూసుమంచి : క్యూలైన్లలో భక్తుల రద్దీ

కూసుమంచి శివాలయంలో..

తిరుమలాయపాలెం : పిండిప్రోలు శివాలయంలో..

బోనకల్లు : శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముదిగొండ : ముత్తారంలో తెప్పోత్సవం

ఎర్రుపాలెం : శివుడికి పూజలు చేస్తున్న అర్చకులు

ఖమ్మంలో కదంతొక్కిన మాలలు

- వర్గీకరణను నిరసిస్తూ ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన ఎమ్మెల్యేలు వివేక్, ఆకేఆర్ నాగరాజు

ఖమ్మం సిటీ, నవంబర్ 15 : ఖమ్మంలో మాలలు కదం తొక్కారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నగరంలోని ఈఆర్ఆర్ ఒయాసిస్ రిసార్ట్ మీటింగ్ హాల్‌లో మాల ఉద్యోగులు, ఆత్మబంధువుల పేరుతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి భారీగా తరలివచ్చారు. తొలుత కాల్వొడ్డు నుంచి వందలాది మోటార్ సైకిళ్లతో నిర్వహించిన ర్యాలీ ఆర్‌వోబీ, మయూరిసెంటర్, వైరా రోడ్, ఇల్లెందు క్రాస్‌రోడ్, ఇందిరానగర్ మీదుగా వేదిక వద్దకు సాగింది. జడ్పీ సెంటర్‌లో పలువురు నాయకులు బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమ్మేళన సభకు ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, ఆర్‌కేఆర్ నాగరాజు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జీ చెన్నయ్య ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. మాలలు చేస్తున్నది వర్గీకరణ వ్యతిరేక పోరాటం కాదని, భారత రాజ్యాంగం రక్షణ పోరాటం అని వారు ఉద్ఘాటించారు. డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు మాలలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు డీ సర్వయ్య, దిగంబర్ కాంబ్లే, రవీందర్, డాక్టర్ గోపీనాథ్, భాస్కర్, రాజేష్, బాలరాజు, హుస్సేన్, లక్ష్మణరావు, ప్రసాద్, రత్నాకర్, స్వర్ణకుమారి తదితరులు ప్రసంగించగా అడ్వకేట్ రాజశేఖర్, వీరభద్రం అధ్యక్షత వహించారు.

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాల నేతలు

వరల్డ్ ప్రిమెచ్యూర్ డే సందర్భంగా 5కే వాక్

ఖమ్మం సిటీ, నవంబర్ 15 : ప్రపంచ ప్రి మెచ్యూర్ డే సందర్భంగా ఈ నెల 17వ తేదీ ఆదివారం ఖమ్మం అంకుర ఆసుపత్రి, ఇండియన్ అకాడమీ– పీడియాట్రిషన్స్(ఐఏపీ) ఆధ్వర్యంలో 5కే వాక్ నిర్వహిస్తున్నట్లు ఐఏపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్ తెలిపారు. శుక్రవారం అంకుర ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రి మెచ్యూర్ బేబీలకు సంబంధించి అవగాహన కల్పించడంలో భాగంగా ఆదివారం లకారం పార్కు నుంచి అంకుర ఆసుపత్రి వరకు ప్రి మారథాన్ ఉంటుందన్నారు. నెలలు తక్కువగా పుట్టడం వలన పసివాళ్లకు పలురకాల రోగాలు సంక్రమిస్తాయన్నారు. ముఖ్యంగా శరీర అవయవాలు వృద్ధి చెందవని అన్నారు. మెదడు, ఊపిరితిత్తులు, కళ్లు వంటి భాగాలు సాధారణ స్థితికి భిన్నంగా ఉంటాయన్నారు. ప్రతి ఏడాది 1.30 కోట్లు మంది పిల్లలు నెలలు నిండకుండానే పుడుతున్నారని, వారిలో 10లక్షల మంది చనిపోతుండగా 20 లక్షల మంది అనారోగ్య కారణాలతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అలాంటి వారు సరైన సమయంలో చికిత్స పొందడం వలన వాటిని అధిగమించవచ్చన్నారు. తల్లి గర్భవతిగా ఉన్నప్పుడే కడుపులోని శిశువుకు న్యూట్రిషన్స్ అందకపోవడం, గర్భంలో ఉమ్మనీరు తక్కువగా ఉండటం వలన పిల్లలు నెలలు నిండకుండా జన్మిస్తున్నారని చెప్పారు. ఆయా విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కోసమే ఫ్రీ మారథాన్ అని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ పలువురు నగర ప్రముఖులు పాల్గొంటారని ఆయన వివరించారు. సమావేశంలో డాక్టర్లు జాకీర్, సింధు, అపర్ణ, జ్యోత్స్న, కల్పన, సాయి ప్రసన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ కూరపాటి ప్రసాద్

పద్మశాలి సంఘ అభివృద్ధికి కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్

ఖమ్మం, నవంబర్ 15 : ఖమ్మంజిల్లాలో అభ్యుదయ పద్మశాలి సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరు కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని రిక్కాబజార్‌లో గల సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జల్లా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారు వెలిగేటి చంద్రమోహన్ మాట్లాడారు. సంఘం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, రాజకీయ భవిష్యత్‌పై చర్చించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర సలహాదారుతోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుడిమెళ్ల సూర్యప్రకాశరావు, వెనగంటి గోవర్ధన్‌రావు, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలుగా కొండా పద్మ, రాష్ట్ర కార్యదర్శులుగా ఉదారి మాధవి, కొండా శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర సంఘం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.కొత్తగా ఎన్నికైన నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు రాష్ట్ర సంఘంలో అత్యధిక ప్రాతినిధ్యం కల్పించిన రాష్ట్ర సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో వి.సూర్యప్రకాశ్‌రావు, ఉదారి పద్మ, జంజిరాల విజయశాంతి, వి.గోవర్ధన్‌రావు, నాగేశ్వరరావు, అనాసి రాధాకృష్ణ , ఉగాది మాధవి, కొండా శ్రీనివాస్, రచ్చ రామారావు, ఆర్.నాగరాజు. ఎం.కిరణ్ కుమార్, మధుబాబు, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిరిపురం యువకుడికి గ్రూప్-4 ఉద్యోగం

వైరారూరల్, నవంబర్ 15: ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–4 ఫలితాల్లో మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా ప్రతిభ కనబర్చి వైద్యాఆరోగ్య శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం పొందాడు. పేద కుటుంబానికి చెందిన నాగుల్ మీరా ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం సాధించాడు. నాగుల్‌మీరాను కుటుంబ సభ్యులు గ్రామస్తులు అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

21న పాసింగ్ అవుట్ పరేడ్ వేడుక

మామిళ్లగూడెం, నవంబర్ 15 : పోలీస్ కానిస్టేబుల్స్ నియామకంలో భాగంగా 9నెలలపాటు శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్స్ పాసింగ్ అవుట్ పరేడ్ వేడుక ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వేడుకలు ఈ నెల 21వ తేదీన ఉదయం 8:30 నుంచి 11:30 వరకు పాసింగ్ అవుట్ పరేడ్ వేడుక ఉంటుందని పేర్కొన్నారు. 9నెలలపాటు 2024 సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన 263మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మల్టీజోన్–1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పాండురంగాపురంలో వైభవంగా 'జ్వాలాతోరణం'

రఘునాథపాలెం, నవంబర్ 15 : కార్తీకమాసంలో అత్యంత విశిష్టత నెలకొన్న జ్వాలాతోరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఖమ్మం నగరం పాండురంగాపురం శ్రీరామలింగేశ్వర ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శివాలయం ఎదుట రెండు కర్రలు నిలువుగా పాతి.. ఒక కర్రను వాటికి అడ్డంగా పెట్టారు. అడ్డంగా పెట్టిన కర్రకు కొత్త గడ్డిని తెచ్చి యమద్వారంగా పెట్టారు. గడిపై నెయ్యిపోసి మంట పెట్టారు. తోరణాలుగా పెట్టిన గడ్డి నుంచే ఎగిసిపడుతున్న మంటల కింద నుంచి పరమేశ్వరుడిని పల్లకిలో అటు ఇటూ మూడుసార్లు ఊరేగించారు. భక్తులు సైతం పల్లకి వెంట ఉండి జ్వాలా తోరణానికి రెండువైపులా తిరిగారు. అగ్నితో తోరణాన్ని కట్టడాన్ని జ్వాలాతోరణం అంటారని ఆలయ ప్రధానార్చకుడు అంబడిపూడి రవి కుమార్ శర్మ తెలిపారు. చైర్మన్ శీలం శ్రీను, చిలుమూరు కోటి, ప్రధాన కార్యదర్శి సామినేని గంగాధర్, కోశాధికారి రాజేశ్, సహాయ కార్యదర్శి బోయిన సురేశ్, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శివనామ స్మరణ చేశారు.

జ్వాలా తోరణంలో స్వామివారి పల్లకిసేవ చేస్తున్న భక్తులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కు అందజేస్తున్న హనుమంతరావు

రఘునాథపాలెం, నవంబర్ 15 : సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం వీ.వెంకటాయపాలెం గ్రామంలో జరిగింది. మాజీ ఎంపీటీసీ యరగర్ల హనుమంతరావు పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక పెద్దలు దిరిశాల వెంకటేశ్వర్లు, వాంకుడోతు దీపక్, రామునాయక్, చల్లగుండ్ల శ్రీనివాసరావు, తమ్మిన్ని నాగేశ్వరరావు, రమేశ్, బండి నాగేశ్వరరావు, ప్రేమ్, సుధీర్, దానయ్య, రామారావు పాల్గొన్నారు.

కేంద్ర బాల సాహిత్య కవి సమ్మేళనానికి సునంద

ఖమ్మంజిల్లాకు దక్కిన అరుదైన గౌరవం

కవి సమ్మేళనానికి హాజరైన సునంద

ఖమ్మం, నవంబర్ 15 : కేంద్ర బాల సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో శుక్రవారం నిర్వహించిన బాల సాహిత్య కవి సమ్మేళనానికి రెండు తెలుగురాష్ట్రాల తరపున ఖమ్మంజిల్లాకు చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త, ఉపాధ్యాయురాలు పురిమళ్ల సునంద ఒక్కరే హాజరయ్యారు. ఇది ఖమ్మంజిల్లాకు దక్కిన అరుదైన గౌరవం. ఈ సందర్భంగా సునంద హిందీ, ఇంగ్లిష్, తెలుగులో గానం చేసిన బాల గేయాలు సాహితీవేత్తల ప్రశంసలు అందుకున్నాయి.

ఎర్రుపాలెం, బోనకల్లులో అన్నదానాలు

అన్నదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ బాధ్యులు

ఎర్రుపాలెం/ బోనకల్లు, నవంబర్ 15: కార్తీక పౌర్ణమి, కార్తీక మాసం సందర్భంగా ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జమలాపురం గ్రామానికి చెందిన బేరి పుల్లారావు, సత్యవతి దంపతులు, కర్నాటి నాగబూషణ్‌రెడ్డి, అన్నపూర్ణ దంపతుల వితరణతో ఇక్కడి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సేవా సమితి బాధ్యులు పాల్గొన్నారు. అలాగే, బోనకల్లులోని శాంతి నిలయంలో గల మానసిక వికలాంగ పిల్లలకు కూడా 'మార్పు' స్వచ్ఛంద సంస్థ బాధ్యులు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర పట్టణానికి చెందిన ఆవునూరి కాళహస్తి జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్నదానంతోపాటు పండ్లు, స్వీట్లు కూడా పంపిణీ చేశారు.

బాధితుడికి ఆర్యవైశ్య సంఘం ఆర్థిక సాయం

సాయం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

బోనకల్లు, నవంబర్ 15: మండలంలోని రావినూతల గ్రామంలో చేడే నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇటీవల కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్నాడు. ఆయన కుటుంబం చాలా ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని గుర్తించిన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చేడే వెంకటేశ్వర రావు.. విషయాన్ని దాతల దృష్టికి తీసుకెళ్లారు. దాతల ద్వారా స్వీకరించిన రూ.14 వేలను శుక్రవారం బాధిత వ్యక్తికి అందజేశారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

చింతకాని మండల నాయకులతో కేటీఆర్

కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ మండల నాయకులు

మధిర (చింతకాని), నవంబర్ 15: చింతకాని మండలంలో అక్రమ కేసులకు గురైన బీఆర్ఎస్ కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. త్వరలోనే జిల్లా పర్యటనకు వస్తానని, అప్పుడు చింతకాని మండలానికి కూడా వస్తానని మాట ఇచ్చారు. చింతకాని సొసైటీ మాజీ చైర్మన్ కోలేటి సూర్యప్రకాశ్, ఆయన కుమారులు కోలేటి వివేక్‌చౌదరి, సాత్విక్‌చౌదరి తదితరులు మాజీ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చింతకాని మండలంలోని రాజకీయ పరిస్థితుల గురించి ఆరా తీశారు.

బిర్సా ముండా జయంతి

బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న అధికారులు, ఆదివాసీలు

పెనుబల్లి, నవంబర్ 15: మండలంలోని లింగగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం బిర్సాముండా జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత చిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెల్లంకి శ్రీను, ఆదివాసి యూత్ సొసైటీ అధ్యక్షుడు పద్దం తిరుపతి రావు, తెల్లం సురేశ్, వెంకటేశ్వరరావు, వెంకటాద్రి, మురళీ, శ్రీకాంత్, కన్నయ్య పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం వితరణ

బియ్యాన్ని అందజేస్తున్న దాతలు

కొణిజర్ల, నవంబర్15: మండలంలోని పల్లిపాడు గ్రామంలో ఉన్న శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి యూపీఎస్‌పీ ఐటీ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వైరా అధినేత రామోజీ ఉప్పలాచారి బియ్యాన్ని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్, నవంబర్15: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వేంసూరు మండలంలోని 21 మంది లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే మట్టా రాగమయి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మన్‌లు దోమ ఆనంద్, భాగం నీరజ, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి సీఎస్ ఆర్ఎంవోగా రాంబాబు

డాక్టర్ రాంబాబు

ఖమ్మం సిటీ, నవంబర్ 15 : జిల్లా సార్వజనీన ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పెద్దాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం ఆయన అదే ఆసుపత్రిలో డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా విధులు నిర్వహిస్తున్నారు. సీఎస్ ఆర్ఎంవోగా పనిచేసిన డాక్టర్ కళావతిబాయి ఇన్‌చార్జ్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిగా వెళ్లినందున ఆమె స్థానంలో డాక్టర్ రాంబాబును నియమించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఏ హోదాలో ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యతాయుతంగా పనిచేస్తానని అన్నారు.

లారీతో వ్యక్తిని తొక్కించి చంపిన డ్రైవర్, క్లీనర్ అరెస్టు

మధిర, నవంబర్ 15: లారీతో ఓ వ్యక్తిని తొక్కించి చంపిన డ్రైవర్‌ను, క్లీనర్‌ను అరెస్టు చేసినట్లు మధిర సీఐ మధు తెలిపారు. మధిర సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగ్‌పూర్ నుంచి సివిల్ సప్లయీస్ కందిపప్పు లోడుతో వస్తున్న లారీని డ్రైవర్ రామిశెట్టి దుర్గారావు నడుపుతున్నాడు. పింగళి మల్లారెడ్డి క్లీనర్‌గా ఉన్నాడు. వీరు లారీని నడుపుకుంటూ ఈ నెల 12న రాత్రి 7 గంటలకు వైరా చేరుకున్నారు. మధిర మీదుగా కంచికచర్ల నుంచి విజయవాడ వెళ్దామనుకొని వైరా దాటిన తర్వాత ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఓవర్‌టేక్ చేసుకొని వస్తున్నారు. ఈ క్రమంలో కొలికపోగు సోమయ్య టూవీలర్‌కు వీరి లారీ తగిలింది. దీంతో కొలికపోగు సోమయ్య వీరి లారీని వెంబడిస్తూ పాలడుగు క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకున్నాడు. అక్కడ లారీని ఆపడంతో డ్రైవర్‌కు, సోమయ్యకు మధ్య వాదన జరిగింది. లారీడ్రైవర్ ఏమీ పట్టించుకోకుండా వస్తుండగా సోమయ్య ఆ లారీని మళ్లీ వెంబడించాడు. కృష్ణాపురం వద్దకు సోమయ్య మరోసారి లారీని అడ్డగించి ఆపాడు. లారీడ్రైవర్, క్లీనర్ లారీని ఆపి దిగివచ్చారు. ఎందుకు లారీని ఆపుతున్నావంటూ ప్రశ్నించారు. లారీడ్రైవర్‌తో సోమయ్య వాగ్వాద పడుతూనే క్లీనర్‌ను చేతులతో నెట్టివేశాడు. తాము చాలా దూరం వెళ్లాలని, తమతో గొడవపడొద్దని, తిరిగి వెళ్లిపోవాలని లారీ డ్రైవర్ సముదాయించాడు. అయినా సోమయ్య వినలేదు. డ్రైవర్ లారీ ఎక్కి స్టార్ట్ ఏసినా కూడా సోమయ్య లారీ ముందు నుంచి కదలలేదు. ఎంతచెప్పినా వినడం లేదు. దీంతో తొక్కించుకొని వెళ్లిపోవాలంటూ క్లీనర్ చెప్పడంతో డ్రైవర్ ఆ లారీని సోమయ్య మీద నుంచి పోనిచ్చాడు. దీంతో సోమయ్య తల పగిలింది. శరీరం ఛిద్రమైంది. అతడు చనిపోయాడనుకున్న లారీ డ్రైవర్, క్లీనర్.. లారీని దెందుకూరు దాటే వరకూ తీసుకెళ్లారు. అక్కడ దానిని పక్కకు నిలిపి పరారయ్యారు. తాజాగా లారీని తీసుకెళ్లేందుకు డ్రైవర్, క్లీనర్ కలిసి లారీ వద్దకు రాగా పోలీసులు వారిని అక్కడ అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపారు. ఈ సమావేశంలో మధిర రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి పాల్గొన్నారు.

ఏలువారిగూడెంలో వ్యక్తి ఆత్మహత్య

తిరుమలాయపాలెం, నవంబర్ 15: మండలంలోని ఏలువారిగూడెంలో శుక్రవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోలెపొంగు లక్ష్మణ్ (49) మద్యానికి బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో భార్యాపిల్లలు మందలించడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి గడ్డి మందు తాగాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న అతడిని స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పత్తి ఖరీదుదారులకు ఏఎంసీ నోటీసులు జారీ!

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 15 : ఖమ్మం నగర వ్యవసాయ మార్కెట్ పరిధిలోని పత్తిపంట కొనుగోలు చేసే ఖరీదుదారులకు మార్కెట్ కమిటీ నోటీసులు జారీ చేసింది. రెండ్రోజుల క్రితం పత్తియార్డు క్రయవిక్రయాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అనేక విషయాలను గ్రహించారు. ముఖ్యంగా పంట నాణ్యతకు అనుగుణంగా ప్రైవేట్ వ్యాపారులు ధర పెట్టకపోవడం గుర్తించిన కలెక్టర్ డీఎంవో, మార్కెట్ కమిటీ సెక్రటరీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. సదరు వ్యాపారులకు నోటీస్‌లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో 26 మంది పత్తి ఖరీదుదారులకు మార్కెట్ కమిటీ సెక్రటరీ నోటీస్‌లు జారీ చేశారు. పంట నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధర పెట్టడం లేదని, నేటివరకు యార్డులో ఒక్క రైతుకు సైతం మద్దతు ధర క్వింటాల్ రూ.7,521 ఎందుకు కల్పించలేదు, మద్దతు ధర కల్పించకపోవడం పట్ల మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు అని నోటీస్‌లో పేర్కొన్నారు. మూడురోజుల్లోగా సమాధానాలు ఇవ్వాలని నోటీస్‌లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లి, నవంబర్15: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం సత్తుప